# రవ్వలగాజులు

— ఉమ్ముల శ్రీనివాసరావు

"నీ శ్రీమతి బాగుంటుందా?"

"చాలా"...

"శారీరకంగానా... మానసికంగానా...???"

ప్రశ్నకొంచెం ఎబ్బెట్టుగా అనిపించినా... ప్రాణ స్నేహితుడవటం చేత "పెళ్ళయి రెండు రోజులేగా... ప్రస్తుతానికి శారీరకంగా" సమాధానం చెప్పాడు.

".... ప్రశ్న వేసిన వాడికి సమాధానం సరైంది దొరికింది లాగుంది... మరో ప్రశ్న కొంచెం పేపాగి వేశాడు.

"పేరేంటాన్నావ్" అనడిగాడు.

అప్పటికి చాలా ప్రశ్నలడికి ఇప్పడీ ప్రశ్న వేశాడేవిటి చెప్మా... అనుకుంటూ అనుమానంగా వాడి మొహంలోకి చూసి చెప్పా... 'లలిత' అని.

"లలిత... పేరు మాత్రం చాలా లలితంగా వుందిరా" అన్నాడు వాడు.

నాకు ఆనందం వేసింది.

'నీ భార్య మొదటి రాత్రి ఏమేం కోరిక కోరిందేవిటి" ఇంకొంచెం లోతుగా ప్రశ్నించడం మొదలు పెట్టాడు వాడు.

వాడలా మొదటి రాత్రి గురించి అడిగే సరికి 'ఆర బోసిన జొన్నల్ని లబగా తింటున్న గువ్వని వడిసెలతో కొట్టినట్లుగా' అనిపించింది నా మట్టుకు నాకు. అయిన వాడు కాక నాకు ఆప్తులు ఇంకెవరున్నారు... అందుకే వాడితో చెప్పేశాను.

"రవ్వల గాజులు కావాలంది" అని...

* * * * *

పరిసితుల్ని... పరిసరాల్ని అర్థం చేసుకున్నట్టున్నాడు సూర్యుడు... తన వేడిని కొంచెం... కొంచెంగా తగ్గించుకుంటున్నాడు.

కిటికీలోంచి బయటకు తొంగి చూసి... "చిగురిస్తున్న యిప్ప వనాన్ని చూసి ఇక తనదే ఆలస్యం అన్నట్టుగా పరిగెట్టుకొచ్చాడు వసంతుడు.. తూలుతూ. .. పాలుతూ.

"ఏవండీ!" గారాబంగా పలికింది లలిత గొంతు.

.... ఆమె గొంతు గారాబంగా వినిపించేసరికి... మత్తుగా, మనోహరంగా వళ్ళు విరుచుకున్నాడు.

"ఏవండీ!" నేను బదులు పలక పోయేసరికి ఆమె గొంతులోకి గారాబం రెట్టింపయ్యింది.

"ఊ!" అన్నాడు ఇక తప్పదన్నట్టు.

"మన పెళ్ళయి సంవత్సరం అయింది. అప్పుడే సంవత్సరం గడిచిపోయిందన్న ఆశ్చర్యం కాదది... ఈ సంవత్సర కాలంలో ఏదో తీరని కోరిక తాలూకు నీలి మబ్బు ఆ కళ్ళలో..."

"అవును!" వంకరపడి తిమ్మిరెక్కిన చెయ్యిని సవరించుకుంటూ అన్నాను. అప్పుడే సంవత్సరం గడిచిపోయిందే... ఆశ్చర్యం వేసింది నాకు. అదేమాట లలితతో అన్నాను.

"మీరు మిన్నకున్నారని కాలం ఆగుతుందేవిటీ?" బుంగమూతి లోతుల్లోంచి సన్నగా ఎక్కడి నుంచో మొదలైన దెప్పిపొడుపు భావన.

"అనుమాన మొచ్చింది" ఆకాశం వైపు చూశాను. "నన్ను వెక్కిరించడానికన్నట్లుగా మబ్బు చాటు నుంచి బయటకు వచ్చాడు చంద్రుడు... చాటంత మొహం చేసుకుని."

"ఏవిటి సంగతి?" గుండె లోతుల్నుంచి గొంతు దాటలేదు కానీ... నాలుక మీద మొదలై పెదాలు దాటి పోయిందా ప్రశ్న.

"అదేనండీ!" ఆమె మనసులో నాకు గుర్తురాక పోతుందా అన్న ఆశ.

"ఏదీ?" గుర్తొచ్చినా... వచ్చినట్లు నాకు నేను చెప్పే ధైర్యం లేక బింకంగా అన్నాను.

"అదేనండీ... ర... రవ్వలగాజులు" ఆ మాట అనేప్పుడు ఆమె కళ్ళు... నా కనుకొలనుల్లో సమాధానం ఏదైనా దొరుకుతుందేమో... అన్నట్టుగా అల్లల్లాడు తున్నాయి.

"నా అనుమానం నిజం అయింది. ఆకాశం వంక చూశాను... వేరే పనేముంది పోకిరీ వాడికి... మరో నలుగురు పోకిరీ తారల్ని వెంటేసుకుని నావంకే చూసి ఫడీ ఫడీ నవ్వుతున్నాడు.

"మాట్లాడరేమండీ?" ఆమె చెయిన నా బజాల్ని కుదిపేసింది.

"ఆ క్షణంలో నా బుర్ర వేగంగా పని చేసింది... ప్రస్తుతం ఆమె కోర్కె నేనెలాగూ తీర్చేస్థితిలో లేను... ఆ విషయం ఆమెతో ఎలా చెప్పేది... అందుకే ఆమెకు కర్తవ్యం గుర్తు చేద్దామని నిర్ణయించుకున్నాను.

"లలితా!... ఈ రోజు బస్సులో వస్తుంటే నా టిఫిన్ బాక్సు పోయింది... కొనడానికి డబ్బుల్లేవు... జీతంరాగానే బాక్సు కొంటాను... అప్పటి వరకు నాకు మధ్యాహ్నం భోజనం అవసరం లేదు... ల సందర్భం? అనిపించినా అనక తప్పలేదు.

"...." అప్పటి వరకు నా ఛాతీ మీద వెంట్రుకలతో దోబూచులాడుతున్న ఆమె చెయ్యి నా వీపు మీద.. నాకు ధైర్యం చెబుతున్నట్టు.

ఆకాశంలోకి చూశాను... ఇప్పుడు చంద్రుడి వం: చూసి బిగ్గరగా నవ్వాలనిపించింది. కానీ... కానిస్టేబుల్ ను చూసిన రోమియోలా మబ్బు చాటుకు ఎప్పుడో ఒరుకున్నాడు.

* * * * *

"డాడీ!" నాలుగు సంవత్సరాల బాబిగాడు... భుజానికి సంచీ తగిలించుకుని నా దగ్గరకు వచ్చాడు.

పుబుసుపోక పాత పుస్తకం చదువుతున్నా నేను తలెత్తి చూశాను... "చంద్ర మండలానికి వెడుతోన్నా వ్యోమగామిలా... మొదటి దండ యాత్రకు బయలు దేరిన ఘజనీ మహమ్మద్‌లా అనిపించాడు.

గొంతు పెగల్చుకొని... "ఏమ్మా!" అన్నాను.

అమ్మ నిన్న పలక తెచ్చింది కానీ బలపం తేలేదు. కొంచెం కొడా బెదురు లేకుండా అడిగేశాడు... మొదటి సారి కదా!

జేబులోంచి పావలా తీసిచ్చాను... "ఎంతవద్దన్నా వాడు స్కూల్లో చేరడానికి లలిత కోసం దాచిన రెండు వేలు ఖర్చయ్యాయన్న విషయం మాత్రం వాడ్ని చూసినప్పుడల్లా గుర్తొస్తూనే వుంది.

* * * * *

తీతువు పక్షి ఇంటి మీదుగా అరుస్తూ వెడితే దోషం ఇంటి గల్ల వాళ్ళకేనా... లేకపోతే అద్దింటి వాళ్ళక్కూడా నా... అన్న శెట్టిగారి అనుమానాన్ని తీర్చడానికి ముక్కు పొడుం మోతాదు పెంచి ధట్టించి చెప్పడానికి వుద్యుక్తులవుతున్నారు పక్కింటి పంతులు గారు.

హడావిడిగా వెళ్ళి ఆటో కావాలన్నారు...

"అసందర్భపు ప్రశ్న" అన్నట్టుగా చిరాగ్గా నా మొహంలోకి చూశాడు కొత్తగా వూర్నుండి వచ్చిన పంతులు గారి బామ్మర్ది.

"హాస్పలా!" మా ఇంటి గుమ్మంలో [illegible] చూస్తు అడిగాడు శెట్టిగారు.

"నుదుటి మీద పట్టిన చెమట తుడుచుకుంటూ... అవునని తలూపాను..."

"గంటెప్పుడేశాడో తెలీదు గాని పంతులు గారి బామ్మర్ది ఆటో తెచ్చాడు..

క్షణాల మీద లలితను ఆటోలోకి చేర్చాం.

గతుకుల రోడ్డు మీద వెళుతున్న ఆటోను చూస్తుంటే "నా ఖర్చు తగ్గించడానికి తన వంతు సాయం చేస్తున్నట్టుగా అనిపించింది.... చిన్నగా నాలో నేను నవ్వుకున్నాను.

ఒకవేళ అదే జరిగితే "ఆ తప్పిన ఖర్చుతో' లలితకు రవ్వల గాజులు చేయిద్దామనుకున్నాను. అదృష్టం ఆమె మీదకు వదిలేసి.

...ఎందుకో ఆ ఆలోచన వచ్చిన మరుక్షణం... నాకు నేనే ఓ పెద్ద బిజినెస్ మన్‌లా అనిపించాను.

* * * * *

ఆటో చేసిన ప్రయత్నాలేవీ ఫలించలేదు. హాస్పటల్ లోనే ప్రసవించింది.

"స్కూల్ కెళ్ళిన ఘజనీ మహమ్మద్ ఇంటికొచ్చే సరికి రాజ్యం విస్తరించింది" ఆడపిల్ల పుట్టింది. ఏం చెయ్యాలో అర్థం కాక... అయినా ఏం చేయలేక గాల్లోకి చూస్తూ కూర్చున్నాను.

* * * * *

మరో అయిదు సంవత్సరాలు గడిచాయి.

తొమ్మిది సంవత్సరాల ఘజనీ మహమ్మద్ అయిదో తరగతిలోకి వచ్చాడు.

నాలుగు సంవత్సరాల పాపాయి చంకలో బ్యాగ్ చూసి సరిగ్గా అయిదు సంవత్సరాల క్రిందటి వూహలు నాలో... నాటికీ నేటికీ ఏవీ తేడా లేదు.

"బలపానికి మాత్రం అర్థ రూపాయిచ్చాను" ఇదే ఎదుగుదల... అంతకు మించి మరేమీ లేదు.

సరిగ్గా పదకొండు సంవత్సరాల మరుగుతో లలిత 'రవ్వలగాజులు' కోరిక కొద్దిగా బలం పుంజుకుంది.

లలితలోని లాలిత్యం మోతాదుగా అగుపిస్తోంది

ఇదివరకటి మృదుత్వం కనుమరుగైంది... తీరని కోరికల స్థానే తరగని వాత్సల్యం ఆమె కనుపాపల్లో లీలగా గోచరిస్తూనే వుంది... అందుకే ఆమె కళ్ళల్లోకి కొత్తగా ప్రవేశించింది 'గంభీరం'

పాడి పాడి మాటలకయితే పోటీ పడి సమాధానం చెప్పేనేను... లలిత గుండె లోతుల్ని చీల్చుకుంటూ వచ్చిన ఆ ప్రశ్నను వినే ధైర్యం కూడా లేకపోయింది నాకు.

అదే 'రవ్వలగాజుల' గురించి...

"జాలిగా ఆమె కళ్ళలోకి చూడాలనిపించింది" నా మధ్య తరగతి బ్రతుకు ఆ మాత్రం ధైర్యాన్ని కూడా నాకివ్వలేక పోయింది.

ఆ క్షణంలో నా మనసులో ఎన్నో భావాలు. నేనాటి అమృతప్పాడికి నేను న్యాయం చేయగలనా అని.

తలెత్తి తన వంక చూడాలేని నా పరిస్థితి అర్థమైంది లాగుంది. అప్పటి వరకు గాంభీర్యాన్ని బతికించిన ఆ కళ్ళతో "ఆర్తిగా హృదయానికి హత్తుకుని లాలించే చూపు నా హృదయాన్ని కదిలించింది. కానీ నాదో 'అసమర్థుని సజీవ యాత్ర' ఏం చేయగలను.

"ఓ మనిషిని ఓ తిట్టు తిట్టు బాధించడం కన్నా ప్రేమించి అంతకన్నా ఎక్కువగా బాధించవచ్చు" అన్న సూక్తి నిజం అనిపించింది.

* * * * *

"ఇరవైఏళ్ళు గడిచినా...."
చంద్రుడు మళ్ళీ మల్లెల్ని విసురు తున్నాడు...
వెన్నెల్లో పువ్వుల్లా...
ఏం వెన్నెలో ఏమో...

కదిలి పోయిన కాలంలో ఎన్ని ఇలాంటి వెన్నెల రాత్రులు తనతో దోబూచులాడుతూ వెళ్ళిపోయినా ఈ వెన్నెల రాత్రి ఎందుకు ప్రత్యేకంగా అనిపించింది నా శ్రీమతికి.



దానికి కారణం లేకపోలేదు. 'నేతికందొచ్చిన కొడుకు 'అమ్మా నీకు రవ్వల గాజులు నేను తీసుకొస్తాను' అన్నాడు.

గడిచిన రోజుల్లో కోరికలతో పోరాడిన అనుభవాలు తాలూకు మొహం మీద పడ్డ ముడతలు ఆ ఆనందంలో వింతగా మెరుస్తుంటే.

"నీకు వేరే రవ్వల గాజులు ఎందుకు లలితా?" అనిపించింది నాకు.

* * * * *

పాతికేళ్ళ వైవాహిక సంసారంలో నా అర్ధాంగి కోరిక తీర్చడానికి పోరాడి... పోరాడి అలసిపోయిన నా గుండెలో సన్నని బాధ మొదలయింది ఈ మధ్య.

...తల్లికి రవ్వల గాజులు తీసుకు రావడానికి బయలు దేరుతూ అలాగే నన్ను ఆసుపత్రికి తీసుకెళ్ళడానికి బయలు దేరాడు నా తనయుడు.

పట్నం బస్సు మా ఇద్దర్నీ... లలిత ఆలోచనల్నీ మోసుకుంటూ జీవితా కాలం లేటు కాకుండానే పట్నం చేరింది.

* * * * *

నా గుండెలనిపి పోయొట్లు ఎన్ని కోణాల్లో పరీక్ష చేసినా నా పరిస్థితి చేయి దాటి పోయిందన్న సంగతి ఆ డాక్టరుకి అర్థం అయిపోయింది.

"పెదవి విరిచే ప్రయత్నం కూడా చెయ్యకుండా... నేను పేషెంట్ నన్నా విషయం కూడా వదిలేసి..."చా లా లేట్ చేశారు" అన్నాడు.

'నాకు అర్థం అయింది నా దండయాత్ర ముగిసిందని" నేను తీరుకోవడానికి కొంచెం సేపు పట్టింది.

మెల్లగా కళ్ళు తెరిచాను. ఎదురుగా కుమార రత్నం. చేతులో రవ్వల గాజుల్తో.

చుట్టూ చూశాను. డాక్టర్ కనిపించలేదు... హమ్మయ్య అనుకున్నాను."

"డాక్టరేమన్నాడు నాన్న" అడిగాడు వాడు.

"ఫరవాలేదు ఇంకా వాడికి తెలియలేదు. డాక్టర్ ఫరవాలేదన్నాడ్రా... అమ్మకి గాజులిచ్చి రెండు రోజులాగి రా అన్నాను.

"నా దగ్గర పళ్ళూ అవీ పెట్టి వూరికి బయలు దేరాడు వాడు..."

ఇప్పుడు నాకు ప్రశాంతంగా వుంది. ఆమె కోర్కె నేనే తీర్చాననిపించింది. నా కళ్ళు మూతలు పడుతున్నాయి.... హృదయం గాలిలో తేలిపోతోంది. భూగోళం బంతిలా కనిపిస్తోంది. కొడుకు తెచ్చిన రవ్వల గాజులు చూసుకొని ఆ ముడతలు పడ్డ మొహంలో ఎంత ఆనందం... నా ఆత్మ శాంతించింది.

* * * * *

ఎంత చూసినా చంద్రుడు ఆకాశంలోకి రావట్లేదు. ఎలా వస్తాడు. పాతిక ముప్పయి సంవత్సరాల మాతో దోబూచులాడి ఈ రోజు తనకన్నా ఎక్కువగా తెల్లని చీరలో... బొట్టులేని మొహంతో మెరుస్తున్నా లలితను చూడలేకేమో... మొహం దాచేశాడు. ●

# చివరితప్పు

'గురుమూర్తి' వయసు యాభై రెండు. అతను ఎప్పుడో హెడ్‌కానిస్టేబుల్ కావలసినవాడు. కానీ చేసిన తప్పు చేయకుండా ఎప్పుడూ ఏదో ఒక తప్పు చేస్తూండడంతో ఇంకా పోలీస్ కానిస్టేబుల్‌గానే వున్నాడు. ఇప్పుడు అతనున్న ఊరికి బదిలీ మీద వచ్చి రెండురోజులయ్యింది.

ఆరోజు సాయంత్రం ఒక యువతి పరిగెత్తుకుంటూ పోలీస్ స్టేషన్‌కొచ్చింది. వెట్లు లేని చోటు ఆముదపు చెట్టే మహా వృక్షమన్నట్లు ఆ సమయంలో పోలీస్ స్టేషన్‌లో ఎస్.ఐ. లేక పోవడంతో హెడ్ కానిస్టేబుల్ 'వెంకటపతి' "... ఏమిటమ్మాయ్... ఏమిటి నీ సమస్య..." అని ఠీవిగా అడిగాడు.

"...సార్! నా పేరు 'దేవకి'. రెండేళ్ళ క్రితం నాకు పెళ్ళయ్యింది. పదిహేను వేల రూపాయల కట్నంతో సకల లాంఛనాలతో పెళ్ళి జరిగింది. అయినా ఇంకా పుట్టింటి నుండి డబ్బు తెమ్మని 'భర్త' అనే 'లైసెన్స్' తగిలించుకున్న నా మొగుడు నన్ను వేధిస్తున్నాడు... ఈ రోజు నన్ను చంపడానికి కూడా ప్రయత్నించాడు.. దయచేసి నన్ను కాపాడండి. మానాన్న పేరు..." ఆ యువతి మాటలు పూర్తిగాక మునుపే..."...అవు... ఆపేసేయ్... విషయం అర్థమైపోయింది. ఆ రాస్కెల్ ను పిలిపించి నీ కాపురం చక్కదిద్దే ప్రయత్నం చేస్తాను. అప్పటి వరకూ నువ్విక్కడే వుండు. లేకపోతే వాడు మళ్ళీ నిన్ను చంపేందుకు ప్రయత్నించవచ్చు..." అన్నాడు హెడ్ కానిస్టేబుల్ వెంకటపతి.

ఆ వెంటనే ఎస్.ఐ.కి ఫోన్ చేసి... "సార్! ఇక్కడొక అందమైన కేసుంది. మీరేమైనా చూస్తారా?" అని అడిగాడు హెడ్ కానిస్టేబుల్.

"ఆ కేసు పేరు దేవకి అవునా?" అని ప్రశ్నించాడు ఎస్.ఐ.

"అవును సార్. ఆ కేసు పేరు మీకెలా తెలిసింది?" ఆశ్చర్యంగా అడిగాడు వెంకటపతి'.

"దాని మొగుడు నా దగ్గరకొచ్చాడు. వాడికి మంచి కట్నంతో మరో పెళ్ళి జరగబోతోందిట... కాబట్టి దేవకికి లాకప్‌డెత్ ప్రెజెంటేషన్ ఇవ్వమని రిక్వెస్ట్ చేశాడు. బేరం కూడా కుదిరింది. పనిలో పని 'రేప్' అంటారు చూడూ... అది కూడా లాగించేయొచ్చు. ఫస్ట్ ఛాన్స్ మాత్రం మొన్న ట్రాన్స్‌ఫర్ మీద వచ్చిన మన గురుమూర్తికి ఇవ్వండి. అతను ఇలాంటి వాటిల్లో 'ఎక్స్‌పర్ట్' అని విన్నాను. అతను నైట్ డ్యూటీకి వస్తాడనుకుంటాను. నాకోసం ఎదురు చూడొద్దు." మాట్లాడక ఫోన్ డిస్కనెక్ట్ చేశాడు ఎస్.ఐ.

గురుమూర్తి డ్యూటీకి రాగానే విషయం చెప్పాడు హెడ్ కానిస్టేబుల్ వెంకటపతి.



"అద్సే... నేనిలాంటివన్నీ మానేశాను" నసిగాడు గురుమూర్తి.

"అదేం... నీలాంటి మగాడు ఎక్కడని కాదుగాని ఎస్.ఐ. గారు చెప్పారు గదా అని" హెడ్ కానిస్టేబుల్ దీర్ఘం తీయగానే.

సరే... ఇదే చివరి తప్పు. ఇకపై ఇలాంటివి చేయకూడదు అని తనకు తాను సర్దిచెప్పుకుని "పదే ఈసారికి లాగించేస్తా" అని హెడ్ కానిస్టేబుల్‌తో చెప్పి గుర్తుమూర్తి లాకప్ రూమ్‌లోకెళ్ళి అటువైపు తిరిగున్న ఆ యువతి చీర కొంగుపట్టి ఓ గుంజ గుంజడంతో చీర మొత్తం ఊడి గురుమూర్తి చేతిలోకి వచ్చింది. ఆ ఊపుకి ఇటువైపు తిరిగిన ఆ యువతి మొహం చూడగానే... కాలం ఆగిపోలేదు. భూకంపం రాలేదు గానీ గురుమూర్తి రాతి గుండె మాత్రం బీటలు వారింది. అతను 'నిర్జీవి' అయ్యాడు. మరో తప్పు చేయడానికి అవకాశం లేకుండా ఆ యువతి గురుమూర్తి కన్నకూతురు 'దేవకి'.

గురుమూర్తి మరణంతో మిగిలిన రక్షకభటులు నికర మనుష్యులై వూడినందుకు వుండినందున ఆ పూట ఓ యువతి మాన ప్రాణాలతో 'లాకప్' రూమ్ నుండి క్షేమంగా బయటపడింది.

— రామగిరి వీరరాఘవులు